4



చట్టాలున్నది మొగుళ్లను బెదిరించడానికి కాదు..!

# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 317 శనివారం 21 డిసెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts





**క్వాష్ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణ 27కు వాయిదా**

హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. అయితే ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. మిగతాది 2లో...

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

## వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్

- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సింఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం





హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు.

మిగతాది 2లో...

# రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'

## హాజరైన గవర్నర్ వర్మ, సీఎం రేవంత్, మంత్రులు



హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఈ తేనీటి విందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులందరినీ రాష్ట్రపతి ముర్ము ఆప్యాయంగా పలకరించారు.

# ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ విచారణ

- తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం
- ధరణి పేరుతో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం
- ఫోరెన్సిక్ విచారణ చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి వెల్లడి
- లక్షన్నర కోట్ల విలువైన భూముల గోల్ మాల్
- ధరణిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం
- బీఆర్ఎస్ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు
- నలుగురు వ్యక్తుల పేర్ల మీద భూముల బదలాయింపు
- ఇరవై ఐదు వేల ఎకరాల అసైన్డ్ భూముల బదలాయింపు



హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ చట్టాన్ని రద్దు చేసి భూ భారతీ తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధరణి అక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ చట్టం పేరుతో చేసిన కబ్జాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఫోరెన్సిక్ విచారణ చేస్తున్నట్టు సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 'ధరణి'పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1 లక్షా 50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు.

మిగతాది 2లో...

## మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

ప్రస్తుతం 3 కోచ్‌లతో నడుస్తోన్న

హైదరాబాద్ మెట్రో రైల్

6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్





# రణరంగంగా అసెంబ్లీ

- కారు రేసింగ్ వ్యవహారంపై చర్చకుబిఆర్ఎస్ పట్టు
- అధికార, విపక్ష సభ్యుల మధ్యవాగ్యుద్ధం
- నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో సభలోకి
- బిఆర్ఎస్ ఎంఎల్ఎలు నినాదాలు చేస్తూ
- స్పీకర్ పోడియంవైపు దూసుకెళ్లేందుకు యత్నం
- బిఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట
- కాగితాలు, వాటర్ బాటిళ్లు విసురుకున్న
- సభ్యులు గందరగోళం మధ్య సభవాయిదా
- మళ్లీ సమావేశమైనా కుదుటపడని సభ
- బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్

2లో.

# కేటీఆర్ చుట్టూ బిగుస్తున్న ఈడీ ఉచ్చు...



**ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో కీలక పరిణామం**

**కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈసీఐఆర్ నమోదు**

**నిన్న కేసు నమోదు చేసిన ఏసీబీ**

**తాజాగా, మనీలాండరింగ్ అభియోగాలతో ఈడీ కేసు**

డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై నిన్న ఏసీబీ కేసు నమోదు చేయగా, నేడు ఈ అంశంలో ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ (ఎన్ ఫోర్స్ మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేశారు. ఇందులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపారు. ఈ కేసులో కేటీఆర్ తో పాటు ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను నిందితులుగా పేర్కొన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ ఈవెంట్లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఏసీబీ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్, ఇతర డాక్యుమెంట్ల కాపీలు ఇవ్వాలని ఈడీ నేడు ఏసీబీని కోరింది. నిబంధనలకు విరుద్ధంగా... విదేశీ సంస్థకు విదేశీ కరెన్సీ రూపంలో నిధులు చెల్లించాలని కేటీఆర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి.కాగా, ఏసీబీ నమోదు చేసిన కేసుపై కేటీఆర్ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయడం తెలిసిందే. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ నెల 30 వరకు కేటీఆర్ పై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఏసీబీని ఆదేశించింది. ఈ క్రమంలో, కేటీఆర్ ఈడీ కేసుపైనా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి.




# ఉభయ సభల్లో కొనసాగిన నిరసనలు

## పార్లమెంట్ నిరవధిక వాయిదా



**ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యుల పోటాపోటీ ఆందోళనలు**

న్యూఢిల్లీ డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): అధికార, ప్రతిపక్ష సభ్యుల పోటాపోటీ నిరసనల మధ్య పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు అవమానంపై పార్లమెంట్ లో ఏ గేట్ల దగ్గరా ప్రదర్శనలు నిర్వహించరాదన్న లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా ఆదేశాలపైన ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యుల నిరసనల నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారం నిరవధికంగా వాయిదా పడింది. మిగతాది 2లో...

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లూ క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

# 30 వరకు అరెస్ట్ చేయవద్దు

(మొదటి పేజీ తరువాయి)

'అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(జీ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే
హెచ్ఎండీఏ చెల్లింపులు చేసిందని వాదించారు. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు' అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు' అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని మాజీ మంత్రి పిటిషన్ వేశారు.

# బిఆర్ఎస్‌ది కచరా గవర్నమెంట్

## ధరణిని వారి కుటుంబం కోసం తెచ్చారు

## భూములపై ఆడిటింగ్ చేయాలన్న పట్టించుకోలే

## అసెంబ్లీలో బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ అక్బరుద్దీన్



హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): ధరణి ఓ కుటుంబం కోసం తెచ్చిందని, దాంతో ప్రజలు ఎలాంటి లబ్ధి పొందలేదని ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.'ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి' అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు. సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. 'మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది' అని కూనంనేని అన్నారు.

# మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ మెట్రో రైలు కొద్దికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. ప్రయాణికులకు మెరుగైన రవాణా అందిస్తూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. నిత్యం 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది హైదరాబాద్ మెట్రో. ఏడేళ్లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను క్రియేట్ చేసింది. ఏడేళ్ల క్రితం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలులో ఇప్పటివరకు 63 కోట్ల మందికి పైగా ప్రయాణం చేశారు. సగటున ప్రతిరోజు 4.75 లక్షల మంది మెట్రో ప్రయాణం చేస్తుండగా.. గరిష్టంగా 5.63 లక్షల మంది ప్రయాణికులుగా జర్నీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మెట్రో ప్రాజెక్టుల్లో ఢిల్లీ మెట్రో ప్రథమ స్థానంలో ఉంటే.. హైదరాబాద్ మెట్రో మూడోస్థానంలో కొనసాగుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంలో మెట్రో రైళ్లు బ్యాక్ బోన్‌గా ఉంటున్నాయి. ప్రారంభంలో మెట్రో ప్రయాణాలపై అంతగా ఆసక్తి చూపని నగరవాసులు.. ఆ తర్వాత మెల్ల మెల్లగా మెట్రో ప్రయాణం వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలో సేవలందిస్తోంది హైదరాబాద్ మెట్రో. ప్రస్తుతం మూడు కారిడార్లలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ, వేగంగా ప్రయాణించేందుకు ఎక్కువ శాతం మెట్రోను ఆశ్రయిస్తున్నారు. వీరితోడు ఉద్యోగులు, విద్యార్థులు సైతం ప్రయాణాలకు ఇష్టపడుతున్నారు. దీంతో మెట్రో రైలులో సైతం విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. బిజినెస్ వేళల్లో కనీసం కాలు నిలపలేని పరిస్థితి. ప్రస్తుతం ట్రైన్లలో కూర్చుని ప్రయాణాలు చేసేందుకు ఏమాత్రం అవకాశం దొరకడం లేదు. ఈ క్రమంలోనే మెట్రో కంపార్ట్‌మెంట్ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మెట్రో ప్రయాణికుల రద్దీపై రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైల్ 3 కోచ్‌లతో నడుస్తోంది. కావున రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెట్రోను 3 కోచ్‌లతో నడిపేందుకు డిజైన్ చేసినట్లు తెలిపిన మంత్రి.. దాన్ని 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆరు కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ యాజమన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కోచ్‌ల పెరిగితే, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని, కూర్చొని ప్రయాణించే వీలు కలుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇక మెట్రో సెకండ్ ఫేజ్‌కు కూడా రేవంత్ సర్కార్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే! రెండో దశలో చేపట్టబోయే పనులపై డీపీఆర్ రెడీ అయింది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన మెట్రో మార్గం.. పలు ప్రత్యేకతల సమాహారంగా ఉండబోతోంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అండర్ గ్రౌండ్ మార్గం నిర్మించేలా ప్రణాళిక రెడీ చేశారు. నాగోల్-ఎయిర్‌పోర్ట్, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్ %-% పటాన్‌చెరు వరకు అవకాశం ఉన్న చోట డబుల్ డెక్కర్ నిర్మిస్తారు. రెండో దశలో ప్రతి కిలో మీటరుకు రూ.318 కోట్లు ఖర్చు అవుతుంది.

# ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ విచారణ

లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్టీ-బీ లో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని .. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ అని చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందని ఆరోపించారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారన్నారు. అలాగే ధరణి వల్ల సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందని న్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో దీనిపై ప్రకటన చేయలేదు కానీ రేపో మాపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెల అవి చట్టంలో పొందుపరచాలని భావించాం.

# రణరంగంగా అసెంబ్లీ

హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ఆరో రో జు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. వాయిదా తీర్మానంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు పట్టుపట్టారు. ఈ ఫార్ములా కార్ రేసింగ్‌పై చర్చ కోసం బీఆర్ఎస్ నేత లు వాయిదా తీర్మానం ఇచ్చారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారంటూ నల్ల బ్యాడ్జీలతో బిఆర్ఎస్ ఎ మ్మెల్యేలు శాసనసభకు వచ్చారు. 420 కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలను ప్ర శ్నించినందుకే అక్రమ కేసులు నమోదు చే స్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదా లు చేశారు. ఈ ఫార్ములా- పైన కేసు అక్ర మం అంటూ ప్లకార్డుల ప్రదర్శన, నినాదా లు చేస్తూ దీనిపై ప్రశ్నోత్తరాల్లో చర్చ జరపాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. అ సెంబ్లీ వ్యవహారాల మంత్రి సభలో లేరని, ఆయన వచ్చిన వెంటనే తన ఛాంబర్‌లో చ ర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని ప్ర కటించారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై చర్చను ప్రారంభించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని స్పీకర్ కోరారు.పొంగులేటి ప్రసంగం ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యులు ముందు ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై చ ర్చించాలని పట్టుబట్టి నినాదాలు చేశారు. సభ జరుగుతున్న సమయంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రచ్చ రచ్చ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీట్లలో కూర్చోకుండా ప్లకార్డులతో నిరసనకు దిగారు. దీంతో స్పీకర్ సభను పదిహే ను నిముషాల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ సభ ప్రారంభం కాగానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూ భార తి చట్టంపై ప్రసంగం ప్రారంభించగానే ఫా ర్ములా ఈ-రేసుపై ఎసిబి కేసు నమోదు చే యడం, దీనిలో ఏ-1గా బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని బిఆర్ఎస్ సభ్యులనుద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని, భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు.బిజెపి సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సభలో మాట్లాడుతున్న సమయంలో మళ్లీ బిఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు బిఆర్ఎస్ సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి బిఆర్ఎస్ వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. స్పీకర్ ఎంత సర్దిచెప్పినా వినకుండా నిబంధనలకు విరుద్ధంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పోడియం వైపు దూసుకువచ్చారు. హరీశ్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పోడియం వైపు వెళుతుండగా సభలోని మార్షల్స్ అడ్డుకున్నారు. అయినా వినకుండా బలంగా తోసుకుచ్చారు. ఈ సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మార్షల్స్ మధ్య తోపులాట జరిగింది. మార్షల్స్‌ను నెట్టేస్తూ పోడియం దగ్గరకు చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేపర్లు చింపి గాల్లోకి ఎగరేశారు. దీంతో అసెంబ్లీ రణరంగంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు వాటర్ బాటిల్స్, పేపర్లు విసురుకున్నారు.

# వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తా

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**- కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దయానంద్ విజయ్ కుమార్**



ఖమ్మం/డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త):
ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కిష్టారం గ్రామ ప్రజలతో సింగరేణి సమస్యలు, కొత్తూరు గ్రామ రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట గ్రామీణ ప్రాంతాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**- యువజన జిల్లా నాయకులు ధనావత్ భాస్కర్ నాయక్**



నల్లగొండ/ డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): మిర్యాలగూడ డివిజన్ ట్యాంకు తండా గ్రామం గుగులోత్ తండ ( ఆమ్లెట్) కి చెందిన గుగులోతు బూరి తండ్రి బిక్య ఇటీవల మృతి చెందారు. శుక్రవారం వారి దశదినకర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ యువజన జిల్లా నాయకులు ధనావత్ భాస్కర్ నాయక్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని నాయకులు భాస్కర్ తెలిపారు. బలహీన వర్గాలు పేదలందరికీ తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. పేదలకు సహాయం చెయ్యాలనే దృక్పథంతో 150 మంది బంధుమిత్రులకు ఈశ్వర బంధం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధనవత్ సైదా మెకానిక్, మెగావత్సేవ, గూగుల్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకానికి తీసుకు వెళుతున్న గంజాయి పట్టివేత

**- నిందితున్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన పోలీసులు**




బోథ్ /డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): మండలంలోని పొచ్చర బస్టాండ్ వద్ద శుక్రవారం గంజాయి అమ్మకానికి తీసుకు వెళుతున్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ వెంకటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం బోథ్ నుండి పోచ్చారా వాటర్ ఫాల్ వరకు పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బస్టాండ్ వద్ద నేరడిగొండ మండలం రాజుల తండా గ్రామానికి చెందిన బస్సీ చందర్ అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతని గమనించిన పోలీస్ సిబ్బంది చాకచక్యంగా అతన్ని పట్టుకొని విచారించినట్లు తెలిపారు. నిందితుడు తన పొలంలో గత సంవత్సరం కొంత గంజాయి పండించాడు. దానిని బోథ్ ఇచ్చోడ మార్కెట్లలో అమ్మడానికి తీసుకు వెళ్తున్న క్రమంలో పోచ్చార బస్టాండ్ వద్ద నిందితున్ని గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితున్ని సోదా చేయగా అతని వద్ద 480 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 12 వేల రూపాయల విలువ ఉంటుందని తేల్చి చెప్పారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వారి వెంట ఎస్సై, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


## ఉభయ సభల్లో కొనసాగిన నిరసనలు

**(మొదటి పేజి తరువాయి)**శుక్రవారం ఉదయం లోక్‌సభ సమావేశమైన వెంటనే 'ఒక దేశం, ఒకే ఎన్నికల'కు సంబంధించిన బిల్లుల పరిశీలనకు పార్లమెంట్ సంయుక్త కమిటీ ఏర్పాటు నిమిత్తం తీర్మానం ప్రవేశపెట్టవలసిందిగా న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను స్పీకర్ కోరారు. పార్లమెంట్ గేట్ల వద్ద ప్రదర్శనలు, నిరసనలను నిషేధిస్తున్న ఆదేశాలను స్పీకర్ చదువుతుండగా సభలో 'జై భీమ్' నినాదాలు ప్రతిధ్వనించాయి. నిరసనలు కొనసాగుతుండడంతో స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.సభ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందుగానే కాంగ్రెస్ సభ్యులు 'జై భీమ్, జై జై భీమ్' అంటూ నినాదాలు చేయనారంభించారు. ప్రతిపక్ష సభ్యుల నినాదాల నడువ ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ చాంబర్‌లోకి అడుగు పెట్టారు. మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెడుతుండగా, మాణిక్కం ఠాగూర్ నేతృత్వంలో కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకుపోయారు.

# ఇచ్చిన మాట తప్పితే ఊరుకునే ప్రసక్తే లేదు..!

**- 11వ రోజుకు చేరిన కేజీబీవీ యూఆర్ఎస్ ల నిరసన**

- సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చుతూ రెగ్యులర్ చేయాలని డిమాండ్
- నిరసన కార్యక్రమానికి చేయూతనిస్తున్న ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు
- రెగ్యులర్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి
- త్వరలో విధులు బంద్ చేసే యోచనలో ఉద్యోగులు



బోథ్/ డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): మార్పు రావాలి, మార్పు కావాలి, సీఎం రెగ్యులర్ చేయాలి అంటూ కేజీబీవీ ఉద్యోగులు నినాదాలు చేశారు. కేజీబీవీ యూఆర్ఎస్ ల నిరసన కార్యక్రమం శుక్రవారం 11వ, రోజుకు చేరింది. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు తలపెట్టింది ప్రజా పోరాటం, స్వాతంత్ర పోరాటం, హక్కుల పోరాటం, బతుకుల పోరాటం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వారికి ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేసి, ప్రజా ప్రభుత్వమని నిరూపించుకోవాలన్నారు.

**జిల్లా అధ్యక్షులు ప్రియాంక**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు గతంలో ఇచ్చిన మాట తప్పితే ఊరుకునే ప్రసక్తే లేదని జిల్లా అధ్యక్షులు ప్రియాంక అన్నారు. తక్షణమే స్పందించి రెగ్యులర్ చేయకపోతే న్యాయం కోసం తలపెట్టిన ఈ ఉద్యమం మరింత తీవ్రస్థాయికి చేరుతుందని, కేజీబీవీ యూఆర్ఎస్ లు పూర్తిగా విధులను బంద్ చేయడం జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌక్ లో నడిరోడ్డుపై కూర్చొని భోజనం చేసి, నిరసన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమానికి భోజన సదుపాయం ఏర్పాటు చేసిన మావల ఎంఈఓ సరోజకు కృతజ్ఞతలు తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్ సింగ్ తిలావత్, శశికళ, నేతలు ఉదయ్ రావు, దేవదాస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏ మాత్రం నిరుత్సాహపడకుండా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల గౌడ్, ఏబీఎం రాష్ట్ర అధ్యక్షులు కినాకే సురేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జె. ధరంసింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పార్థసారథి,





వెంకటి, దేవదర్శన్, దీప్తి, సురేష్, స్వప్న, సురేందర్, వందలాది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

**- సుమారు పది లక్షల విలువచేసే 17 బైక్ లు స్వాధీనం - దేవరకొండ డిఎస్పి జి. గిరిబాబు**



దేవరకొండ/డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శుక్రవారం కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండ డిఎస్పి గిరిబాబు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కొండమల్లేపల్లి , చింతపల్లి, గుడిపల్లి, దేవరకొండ ప్రాంతాలలో వరుస బైక్ దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు దేవరకొండ డి.ఎస్.పి నేతృత్వంలో కొండమల్లేపల్లి సిఐ, ఎస్సై ప్రత్యేక బృందంగా ఏర్పడి, సాంకేతిక పరిజ్ఞానంతో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను గుర్తించారు. శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు వాహనాల తనిఖీలో భాగంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో

బైక్ దొంగల ముఠాను పట్టుబడి చేసి వారిని విచారించగా కొత్త విషయాలు బయటకు వచ్చాయన్నారు. ఇట్టి దొంగలు ముఠాగా ఏర్పడి జల్సాలకు, చెడు అలవాట్లకు బానిసై రాత్రి సమయంలో ఇంటి ముందల ఓపెన్ ఏరియాలలో పార్కు చేసిన బైకులను టార్గెట్ చేసి, వారి వద్ద తెచ్చుకున్న నకిలీ తాళల ద్వారా బైకులను దొంగిలించారు. ఇట్టి దొంగలు కొండమల్లేపల్లి , గుడిపల్లి, దేవరకొండ, చింతపల్లి, మాడుగుల, యాచారం మండలాల పరిధిలో సుమారు 17 బైకులు దొంగిలించినారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారి వద్ద నుండి సుమారు 10 లక్షల విలువ చేసే 17 బైక్ లను స్వాధీనపరచుకున్నారు.
ఈ కేసును చేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్సైలు రామ్మూర్తి, నరసింహులు వారి క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్, వెంకటేష్, శేఖర్ రెడ్డి, హెూంగార్డు లక్ష్మయ్య, రమేష్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేసినట్లు వారు తెలిపారు.

**అరెస్టు చేసిన నిందితుల వివరాలు**

1) భక్తోజు శివ బైక్ మెకానిక్ 2) ఆరెండు గౌతమ్ స్టూడెంట్ 3) వరికుప్పల అశోక్ స్టూడెంట్ 4) సురకారపు శివ స్టూడెంట్, మొత్తం నిందితులు నల్లగొండ జిల్లా చింతలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఎవరిని చూసినా నిండా 19 సంవత్సరాలు లేని వయసు వారే ఉన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి పొందాలి

**- నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**




ఖమ్మం/డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): నైపుణ్యాభివృద్ధితో స్వంత బలం మీద ఉపాధి పొందడమే కాకుండా 10 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ముంపు ప్రాంత ప్రజలకు స్వయం ఉపాధికి ఆర్సిఎం బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో కరుణగిరి బైపాస్ రోడ్ లోని కారుణ్య కమ్యూనిటీ సెంటర్లో ఏర్పాటుచేసిన నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలతో ఎన్నో బాధలు పడి, ధైర్యంగా నిలదొక్కుకున్నామన్నారు. నైపుణ్య కార్యక్రమం ద్వారా జీవన రీతిని, పద్ధతిని మార్చుకోనుటకు అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు కుట్టుమిషన్, హెూమ్ నర్సింగ్, ఇస్త్రరాకులు, కప్స్, క్యాండీల్స్, అగరవత్తుల తయారీ, బ్యూటీషియన్ తదితరాల్లో నైపుణ్యం పొంది, స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నారు. మనం అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు, సమాజం, గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందరూ బాగుంటేనే మనం బాగుంటామనే భావన రావాలన్నారు. కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ, సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమానికి వచ్చిన మహిళల సమస్యల పట్ల కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరదల్లో ఇండ్లు కొట్టుకుపోవడం, తీవ్ర నష్టం వాటిల్లడం జరిగింది. ఇండ్ల నిర్మాణానికి మహిళలు కోరగా, ఇందిరమ్మ



ఇండ్ల సర్వే జరుగుతున్నట్లు, మొదటి విడతగా స్థలాలు ఉన్న వారికి పథకము యొక్క లబ్ది చేకూర్చనున్నట్లు, దశల వారిగా అర్హులందరికి ఇండ్లు మంజూరులు జరగనున్నట్లు తెలిపారు. కాలనీల్లో రోడ్లు, మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. అనంతరం రాజీవ్ గృహకల్ప సమీపంలో ఉన్న మదర్ థెరిస్సా ఓల్డ్ ఏజ్ హెూమ్ ను కలెక్టర్ సందర్శించారు. ఆశ్రమంలో అనాధలకు అందుతున్న సేవలను పరిశీలించారు. వరదల వల్ల దెబ్బతిన్న భవనాలు పరిశీలించారు. నీరు సాఫీగా వెళ్లిపోయేలా కార్యాచరణ చేయాలన్నారు. నష్టానికి ప్రభుత్వం నుండి సహకారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ తహశీల్దార్ రాంప్రసాద్, ఫాదర్ తప్పేట శౌరీ వికార జర్నల్, ఫాదర్ మాధ్యు వరప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో

# దర్శనమిస్తున్న అపరిశుభ్రత

- పరిశుభ్రత పనులు పాటించాల్సింది ఎవరు?
- ఆ కార్యాలయాన్ని పట్టించుకునే బాధ్యత ఎవరిది?
- నిర్లక్ష్యం చేయడానికి కారణాలు ఏంటి?
- ఆదర్శంగా ఉండాల్సిన కార్యాలయం ఎలా ఉంది?







వరంగల్/ డిసెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. ఆరోగ్య సూత్రాలను వివరిస్తూ, పరిశుభ్రతను పాటించాలని సూచించే అధికారులే పరిశుభ్రత పాటించకపోతే ఎలా? అంటూ పలువురు ముక్కును వేలేసుకుంటున్నారు. అపరిశుభ్రంగా తయారైన ఆ కార్యాలయం పరిశుభ్రత పనులు పాటించాల్సిన బాధ్యులు ఎవరు? ఆ కార్యాలయంలో అపరిశుభ్రతతో పాటు మౌలిక వసతుల కల్పన కరువైందని వస్తున్న ఆరోపణలపై బాధ్యత తీసుకోవాల్సిన అధికారులు ఎవరు? నిర్లక్ష్యపు నీడలో ఆరోగ్య వైద్యాధికారి కార్యాలయం కనిపిస్తుందన్న విమర్శలకు కారణాలేంటి? ఇలా అనేక రకాల సందేహాలు వరంగల్ డిఎంహెచ్ఓ కార్యాలయంపై వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే మొట్టమొదటిగా ఆ కార్యాలయాన్ని చూసి గుర్తించలేని పరిస్థితి చోటు చేసుకుంది. కార్యాలయం పేరైన కనిపించకపోవడం విశేషంగా మారింది. కార్యాలయము లోపల భాగంలో గోడలపై పేరుకుపోయిన బూజు, స్టెప్స్ ప్రక్కనే గోడలపై అతి దారుణంగా ఉమ్మివేసిన పాన్ మసాలలు, కార్యాలయం చుట్టూ పేరుకుపోయిన చెత్త చెదారం, కార్యాలయం లోపలి భాగంలో విపరీతాలతో పాటు కార్యాలయావరణంలో ఉపయోగంలో లేని వాహనాలపై ఏపుగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు, దాదాపుగా 20 సంవత్సరాల క్రితం నుంచి ఇప్పటివరకు అందులో లిఫ్ట సేవలు అందుబాటులో లేకపోయాయి. డిఎంహెచ్ఓ కార్యాలయానికి అనుసంధానంగా పనిచేస్తున్న ఉద్యోగులంతా సమావేశాల కోసం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన ఈతరాత్ర మెటీరియల్ తీసుకువెళ్లడానికి వస్తూ, వెళుతుంటారు. అధిక బరువు కలిగిన మెటీరియల్ చేతబట్టుకొని స్టెప్స్ దిగేటప్పుడు ఆ ఉద్యోగులంతా నీరసంగా మారిపోతున్నారు. క్రిందకు వచ్చేసరికి చెమటలతో తడిసిపోతున్నారు. పరిశుభ్రత లోపించి, సరైన వసతులు లేకుండా, పట్టించుకునే నాధుడే లేరన్న రీతిలో తయారైన డిఎంహెచ్ఓ కార్యాలయ పరిస్థితులను గమనించినవారు ఆశ్చర్యానికి లోనౌతున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన కార్యాలయం అధ్వానంగా మారిపోవడం బాధాకరం. వరంగల్ జిల్లా పరిధిలోని ఆరోగ్య ప్రాథమిక కేంద్రాలకు సంబంధించిన ఉద్యోగులంతా నిరంతరం ఆ కార్యాలయానికి చేరుతుంటారు. అధికారిగా ఆదేశానుసారం సమావేశాలతో పాటు శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తూ ఉంటారు. ఇలా అధికారిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా అధిక సంఖ్యలో హాజరయ్యే ఉద్యోగులకు ఆ కార్యాలయం కాస్త ఇబ్బందికరంగానే మారిందని చెప్పవచ్చు. కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై వివరణ కోసం డిఎంహెచ్ఓ అధికారిని సంప్రదించాలని ప్రయత్నిస్తే ఫలితం లేకపోతుంది.





### ఆ కార్యాలయంలో రెండు జిల్లాలకు చెందిన అధికారులు ఉంటారు

డిఎంహెచ్ఓ కార్యాలయముగా పిలువబడే ఆ భవనంలో రెండు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పనిచేస్తున్నారు. ఇదేం విడ్డూరమో కళ్ళముందే అపరిశుభ్రత సమస్యలు కనిపిస్తున్నా.. ఎవ్వరు పట్టించుకోకపోవడం ఏంటని వరంగల్ నగరంలో చర్చ సాగుతోంది. సమస్యలతో తమకేమీ పనిలేదని వ్యవహరించే అధికారులకు తీరుపై పలు రకాల విమర్శలు వినిపిస్తున్నాయి. సమయానికి ఉద్యోగం చేసామా? నెలసరి వేతనాలు పొందుతున్నామా..లేదా? అన్న తీరుగా అధికారుల వ్యవహారం మారడంతో ఇంత నిర్లక్ష్య ధోరణి ఏంటని వరంగల్ పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఆ కార్యాలయంలో విధులు నిర్వర్తించేవారు బాధ్యతగా వ్యవహరించి, పరిశుభ్రత పనులు పాటించే అవకాశం తీసుకోనున్నారా? వేచి చూడాల్సిందే మరి..



## చిల్లాపురం రామాలయంలో

# కుంకుమ పూజ

నల్గొండ/ డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): మిర్యాలగూడ డివిజన్ చిల్లాపురం గ్రామంలోని సీతారామ ఆంజనేయ దేవాలయంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి ఇందు ప్రచార పరిషత్ నల్గొండ శాఖ ఆర్ ధనంజయ భజన మండలి ప్రోగ్రామ్ అసిస్టెంట్ హెచ్ డిపిపి వారిచే సీతారామాంజనేయ దేవాలయం చైర్మన్ సాతునూరి వెంకటేశ్వర్లు రాధిక ఆధ్వర్యంలో మంగళ, బుధ, గురు వారాల్లో భజన, ఉపన్యాస కార్యక్రమాలు చేపట్టారు. ఉపన్యాసం కుంకుమ పూజ కార్యక్రమాన్ని మహిళలచేత అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. భజన బృందం చేపట్టిన భజన కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులైనారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం చైర్మన్ సాతునూరి వెంకటేశ్వర్లు రాధిక మాట్లాడుతూ చిల్లాపురం సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఇంక ముందు జరిగే సాంస్కృతిక భక్తి కార్యక్రమాలకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రామాలయం చైర్మన్ సతీమణి సాతునూరి రాధిక మహిళా భక్తులతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాతునూరి వెంకటేశ్వర్లు, సాతునూరు అంజయ్య, కోట్ల శ్రీనివాస్, రాంబాబు, మల్లీకంటే అంజయ్య, మహిళలు పంతులు వెంకన్న సోమ, ఎం శ్రీను, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు

# పెంపొందించాలి

### -జిల్లా డిసిఇబి కార్యదర్శి గారే కృష్ణమూర్తి



రాయపర్తి/ డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా డిసిఇబి కార్యదర్శి గారే కృష్ణమూర్తి అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని కలిగించే విధంగా,అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా సులభతరంగాలి విద్యార్థులకు లోకాస్ట్,నో కాస్ట్ అనే బోధన ఉపకరణ పరికరాలను తయారు చేసి విద్యార్థులకు మెరుగైన పద్ధతిలో బోధనాంశాలు బోధించాలని అన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతయుతంగా సమయపాలన పాటించాలని అన్నారు. ప్రాథమిక ఉన్నత స్థాయిలో విద్యార్థులకు హిందీ పట్ల అవగాహన కలిగి ఉండే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైలారంలి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర ఉమాదేవి,ఆర్పీలు వెంకటేశ్వరరావు, రజినీకాంత్,వెంకటరమణ, కే మహేశ్వర్,జి సునీత,వెంకటరమణ,రాజు,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్‌ల చలో ఆసెంబ్లీ..

# అడ్డుకున్న పోలీసులు



హైదరాబాద్, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
తమ న్యాయమైన సమస్యైలను పరిష్కరించాలని కోరుతూ ఆటోడ్రైవలర్లు చలో ఆసెంబ్లీ కార్యక్రుమం నిర్వహించారు. తెలంగాణ ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఎఐటియుసి రాష్ట కార్యాలయం హిమాయత్నగర్ నుండి చలో అసంబ్లీ కార్యక్రమం నిర్వయించగా పోలీసులు అడ్డుకొని ఆటో సంఘాల జాక్ కన్వీనర్ బి వెంకటేశం (ఎఐటియుసి), ఎ. సత్తిరెడ్డి (టిఎడిఎస్‌వి), మారయ్య (బిఆర్‌టియు), ఎంఎ సలీం (యూనిటీ తెలంగాణ), టియుసిఐ నాయకులు ప్రవీణ్, ఎఐటియువి నాయకులు ఎస్. అశోక్, జంగయ్య, కృష్ణమూర్తి, ఎం కృష్ణయ్య, ఎం. శ్రీను, నజీర్, ఎ. బిక్షపతి యాదవ్, ఎండి ఉమర్ ఖాన్ తదితర నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి లాలాగూడ, అంబర్పేట్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ఆటో డ్రైవర్లకు ఆటో పర్మిట్ లు ఇవ్వాలని, ఓలా ఉబర్ సంస్థలను రద్దుచేసి ప్రభుత్వమే ఒక యాప్ తయారు చేయాలనే ప్రదాన డిమాండ్‌లను పరిష్కరించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అనేక ఆందోళనను చేసినా ప్రభుత్వం పట్టిచుకోలేదు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు . ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# చట్టాలున్నది మొగుళ్లను బెదిరించడానికి కాదు..!

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
వివాహ వ్యవస్థను హిందువులు పవిత్రమైనదిగా, కుటుంబానికి బలమైన పునాదిగా భావిస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. అది వ్యాపార సాధనం కాదని తెలిపింది. మహిళల సంక్షేమం కోసమే ప్రభుత్వాలు కఠినమైన చట్ట నిబంధనలను రూపొందించాయని వ్యాఖ్యానించింది. అంతే కానీ భర్తలను వేధించి, బెదిరించి, శిక్షించి, ఆస్తిని దండుకోవడానికి కాదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. భార్యను క్రూరంగా హింసించారని, వేధింపులకు గురిచేశారని, అత్యాచారం చేశారనే ఆరోపణలన్నింటినీ ప్యాకేజీగా కూర్చి నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ల ప్రకారం భర్త, అతడి కుటుంబ సభ్యులపై కేసులు పెడుతున్నారని ధర్మానం




పేర్కొంది. తీవ్ర మనస్పర్థలతో విడివిడిగా నివసిస్తున్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో భార్యకు శాశ్వత భరణం కింద రూ.12 కోట్లను నెలలోగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. అతడిపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేసింది. భార్య తరఫున గట్టిగా బేరసారాలు చేసేందుకు భర్త, అతని కుటుంబ సభ్యులపై తీవ్రమైన నేరారోపణలు చేయటం కూడా పరిపాటిగా మారిందని ధర్మాసనం ఆక్షేపించింది. ఈ డిమాండ్లలో అత్యధికంగా ఆర్థికపరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం తెలిపింది. గృహ హింస ఫిర్యాదులతో రంగంలోకి దిగే పోలీసులు కూడా భర్త తరఫు బంధువుల్లో వృద్ధులను, అనారోగ్యంతో ఉన్నవారిని కూడా అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తున్నారని, ఈ ఘటనలన్నీ గొలుసుకట్టు మాదిరిగా ఉంటాయని పేర్కొంది. తన భర్తకు రూ.5 వేల కోట్ల ఆస్తులున్నాయని, అతడి తొలి భార్యకు రూ.500 కోట్లను భరణంగా ఇచ్చారు కనుక తనకూ అదే స్థాయిలో చెల్లించాలన్న పిటిషనర్ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. కుటుంబ కోర్టు నిర్ణయించిన రూ.12 కోట్ల భరణాన్ని ఖరారు చేసింది. విడాకులు తీసుకున్న తర్వాత మాజీ భర్తకు వ్యాపారంలో నష్టాలు వచ్చి దివాలా తీస్తే మాజీ భార్య వచ్చి ఆ కష్టాల్లో ఏమైనా భాగం పంచుకుంటుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

# దేశంలోనే అతి పెద్దదైన రామ్ చరణ్ కటౌట్...

### ఈ నెల 29న ఆవిష్కరణ...

### విజయవాడలో రామ్ చరణ్ భారీ కటౌట్ ఆవిష్కరణకు రంగం సిద్ధం




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ చేంజర్ జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వస్తున్న తరుణంలో, మేనియా మొదలైంది. గేర్ మార్చిన చిత్రబృందం ప్రమోషన్స్ ను పీక్స్ కు తీసుకెళ్లేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించుకుంటోంది. ఈ క్రమంలో, డిసెంబరు 29న భారతదేశంలోనే అతి పెద్దదైన రామ్ చరణ్ కటౌట్ ను ఆవిష్కరించనున్నారు. ఇది ఎక్కడో కాదు... విజయవాడ బృందావన్ కాలనీలో వజ్రా గ్రౌండ్స్ ఇందుకు వేదికగా నిలుస్తోంది. సాయంత్రం 4 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు గేమ్ చేంజర్ మేకర్స్ అనౌన్స్ చేశారు. రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా సౌతిండియా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న గేమ్ చేంజర్ చిత్రం ప్రారంభం నుంచి ఓ రేంజ్ లో బజ్ క్రియేట్ చేసింది. తమన్ సంగీతంలో వచ్చిన ఈ సినిమా పాటలు ఆడియన్స్ ను ఉర్రూతలూగిస్తున్నాయి. దానికి తోడు టీజర్ తో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఎక్స్ పెక్టేషన్స్ కు ఏమాత్రం తగ్గకుండా తమ చిత్రం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. శంకర్ ట్రాక్ రికార్డు చూస్తే...గేమ్ చేంజర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఖాయమన్న టాక్ వినిపిస్తోంది.

# పూజా హెగ్డే పాంచ్ పటాకా.. దెబ్బ అదుర్స్



బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ నుంచి పెద్దగా అవకాశాలు అందుకోవట్లేదు. రాధే శ్యాం ముందు వరకు స్టార్ సినిమా అంటే పూజా పేరు వినిపించేది కానీ ఇప్పుడు ఆమెను ఎవరు పట్టించుకోవట్లేదు. పూజా హెగ్డే ని తెలుగు పరిశ్రమ పూర్తిగా దూరం పెట్టింది. దీని వెనక కారణాలు ఏంటన్నది మాత్రం తెలియదు. ఐతే టాలీవుడ్ లో ఛాన్సులు లేకపోయినా బాలీవుడ్ లో సినిమాలు చేస్తుంది పూజా హెగ్డే. ప్రస్తుతం అక్కడ షాయిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తుంది అమ్మడు. ఈ సినిమా పూర్తి కాకుండానే వరుణ్ ధావన్ సినిమాలో సెలెక్ట్ అయినట్టు తెలుస్తుంది. బాలీవుడ్ తో పాటు కోలీవుడ్ నుంచి కూడా పూజా హెగ్డేకి ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే సూర్య 44 సినిమాలో నటిస్తున్న పూజా బేబ్ ఆ సినిమా సెట్స్ మీద ఉండగానే దళపతి విజయ్ చివరి సినిమాలో ఛాన్స్ అందుకుంది. విజయ్ తో ఆల్రెడీ బీస్ట్ సినిమా చేసిన పూజా హెగ్డే మరో లక్కీ ఛాన్స్ అందుకుంది. ఇక ఈ సినిమాతో పాటు లేటెస్ట్ గా లారెన్స్ చేస్తున్న కాంచనా సీరీస్ లో కూడా పూజా హెగ్డే ఫైనల్ అయినట్టు తెలుస్తుంది. పూజా కి తమిళ పరిశ్రమ నుంచి వస్తున్న ఈ ఆఫర్లు కచ్చితంగా ఆమె కెరీర్ ని మళ్లీ సెట్ రైట్ చేసుకునేలా చేస్తుందని చెప్పొచ్చు. మొన్నటిదాకా చేతిలో ఒక్క సినిమా కూడా లేదని పూజా గురించి మాట్లాడిన వారంతా కూడా ఇప్పుడు అమ్మడు చేస్తున్న ఐదు సినిమాల గురించి చెప్పుకుంటున్నారు. పాంచ్ పటాకాతో పూజా మళ్లీ తన కెరీర్ లో జోష్ నింపుకుంది. పూజా హెగ్డే ఫ్యాన్స్ కి ఈ సినిమాలు తప్పకుండా సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయని చెప్పొచ్చు. తెలుగులో కెరీర్ ముగిసింది అనుకునేలోగా కాస్త డల్ అయిన అమ్మడు తమిళ్, హిందీ పరిశ్రమల నుంచి వస్తున్న ఆఫర్లతో ఖుషి అవుతుంది. ఈ సినిమాల విషయంలో పూజా హెగ్డే చాలా కాన్ఫిడెంట్ గా ఉందని అర్థమవుతుంది. ఇక ఈ సినిమాల్లో ఏ ఒక్కటి హిట్ అయినా మళ్లీ టాప్ లీగ్ లో పూజా హెగ్డే కొనసాగే ఛాన్స్ ఉంటుంది. తన పని అయిపోయింది అనుకున్న వారందరికీ సమాధానం చెబుతూ పూజా హెగ్డే ఈ సినిమాలతో మరోసారి తన సత్తా చాటబోతుందని చెప్పొచ్చు.

# ప్రైవేసీ ఇవ్వండి : విజయ్‌దేవరకొండ



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ గురించి ఎప్పుడు ఎదో ఒక వార్త ట్రెండ్ అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం విజయ్ డేటింగ్ లైఫ్ గురించి అనేక వార్తలు ప్రచారమవుతున్న నేపథ్యంలో ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చాడు. తన పర్సనల్ విషయాలు గురించి వెల్లడించేందుకు సరైన టైమ్ చూసుకొనే వాస్తవాలు మాట్లాడుతా అన్నారు. ఇంకా ఏం చెప్పారంటే.. రీసెంట్‌గా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... "నేను ప్రజల ముందున్న వ్యక్తినే. నాకు సంబంధించిన విషయాలు అందరికి తెలుసుకోవాలనే ఆసక్తి సహజమే. కానీ, నా జీవితంలో ఓ ప్రత్యేక సమయం వచ్చినప్పుడు మాత్రమే వాటిని పంచుకుంటాను పబ్లిక్ ఫిగర్‌గా ఉండటం వల్ల చాలా వార్తలు వస్తాయి. వాటిని నేను సాధారణంగానే స్వీకరిస్తాను. అవి నా దృష్టిలో కేవలం వార్తలుగానే ఉంటాయి. అపారమైన ప్రేమ ఉంటే, దాని వెంట బాధ కూడా తప్పదు. ప్రేమించడం అంటే బాధను కూడా పంచుకోవడం. తగిన సందర్భంలో, సరైన కారణంతోనే విషయాలను పంచుకుంటా" అని ఆయన క్లారిటీ ఇచ్చేశాడు. ప్రస్తుతం విజయ్.. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి, రవి కిరణ్ కోలా, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ మూడు సినిమాలు చేయనున్నాడు. ఇక 14 కథ విషయానికొస్తే.. రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కనుంది. ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ ఆసక్తి కలిగిస్తోంది. బీటలు వారిన పంట పొలాల్లో రాతిపై చెక్కిన వీరుడి విగ్రహం ఉంది. దాని మీద 'ది లెజెండ్ ఆఫ్ ది కర్స్డ్ ల్యాండ్' అని రాసి ఉంది. ఆయన జీవిత కాలం 1854 నుంచి 1878గా పేర్కొన్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

# 'ముఫాసా' ది లయన్ కింగ్' సరికొత్త రికార్డు




సోషల్ మీడియా ట్రెండ్స్‌లో మహేష్ బాబు ఫ్యాన్స్ అందరి హీరోల అభిమానుల కంటే ముందుంటారు. అలాగే టికెట్స్ బుకింగ్స్, కలెక్షన్స్ విషయంలోను కొత్త హిస్టరీలను ఎప్పటికప్పుడు కొత్తగా సృష్టిస్తూనే ఉంటారు. ప్రస్తుతం మహేష్ సినిమా ఏది రిలీజ్ లేకపోయినప్పటికీ బాబు ఫ్యాన్స్ సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కించిన 'ముఫాసా' ది లయన్ కింగ్' నేడు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయ్యింది. ఇంగ్లీష్ వెర్షన్ కి ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులువాయిస్ అందించగా హిందీలో షారుఖ్ ఖాన్ తన గాత్రాన్ని అందించారు. ఇక తెలుగులో మహేష్ బాబు, సత్యదేవ్, బ్రహ్మానందం, అలీ తదితరులు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ లో ఈ మూవీ ఉదయం 8 గంటల షో హౌస్ ఫుల్ అయ్యింది. అయితే ఈ సినిమాకి ఇండియాలోని అన్ని థియేటర్ల కన్న ముందే ఫుల్ కావడం విశేషం. ఇది కంప్లీట్‌గా మహేష్ బాబు ఫ్యాన్స్ డామినేషన్. కేవలం వాయిస్‌కే కటౌట్లు పెట్టి, హౌస్ ఫుల్స్‌తో రికార్డులు నెలకొల్పుతున్న మ్యాడ్‌నెస్ ఆయన అభిమానులకు మాత్రమే సొంతం. మరోవైపు మహేష్, రాజమౌళి సినిమా జనవరి ద్వితీయార్థంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి షూటింగ్ మొదలుపెడతారు. ఇప్పటికే ఏర్పాటు జరుగుతున్నాయి. అయితే రాజమౌళి స్క్రిప్ట్ విషయంలో ఇంకాస్త సమయం తీసుకోబోతున్నారని, ఏప్రిల్ వరకూ షూటింగ్ మొదలు కాదని అనుకున్నారు. అయితే జనవరిలోనే ఈ సినిమా ప్రారంభానికి శ్రీకారం చుట్టడం అభిమానులకు కాస్త ఆశ్చర్యంగా ఉంది.

# 'భూత్ బంగ్లా' లో టబు.. అసలేం జరుగుతోంది?



జాతీయ ఉత్తమ నటి టబు ఇటీవలే 'క్రూ' సినిమాలో కరీనా, కృతి సనోన్ తో పోటీపడి మరీ నటించింది. ఈ సినిమా తర్వాతా పలు క్రేజీ చిత్రాలకు టబు సంతకాలు చేసిందని సమాచారం. ఇదే వరుసలో ప్రియదర్శన్ - అక్షయ్ కుమార్ క్రేజీ కాంబినేషన్‌తో కలిసి 'భూత్ బంగ్లా' అనే చిత్రానికి సంతకం చేసిందని సమాచారం. ఇది హారర్ కామెడీ ఫ్రాంఛైజీ. ఇందులో ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సినిమా చేయాలని ప్రియదర్శన్ బృందం ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. ఇక ఈ ఫ్రాంఛైజీతో ఏక్తా కపూర్ లాంటి బోల్డ్ మహిళా నిర్మాత చేరడం మరింత ఆసక్తిని పెంచుతోంది. అక్షయ్ - ప్రియదర్శన్ 13 సంవత్సరాల తర్వాత ఒక హార్రర్ కామెడీ కోసం తిరిగి కలుస్తుండడం కూడా ఆసక్తిని కలిగిస్తోంది. ఈ కామెడీ చిత్రంలో పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, అస్రానీ తదితరులు నటిస్తున్నారు. అక్షయ్ కుమార్ సరసన యువకథానాయిక వామికా గబ్బి నటించనుంది. 2000లో హేరా ఫేరిలో చివరిగా కలిసి నటించిన తర్వాత టబు- అక్షయ్ కుమార్ ఇంత కాలానికి తిరిగి కలుస్తుండటం అభిమానుల్లోను ఉత్సాహం పెంచుతోంది. హారర్ కామెడీ స్క్రిప్టులో తన పాత్ర బాగా నచ్చడంతో టబు ఈ చిత్రానికి ఓకే చెప్పారట. ప్రియదర్శన్ సృష్టించబోయే క్రేజీ ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి టబు చాలా ఉత్సాహంగా వేచి చూస్తోందని సమాచారం. భూత్ బంగ్లా కాస్టింగ్ రోజురోజుకు పెద్దదవుతుంటే అది మరింత ఉత్కంఠను పెంచుతోంది ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఏప్రిల్ 2025 నాటికి పూర్తి చేసి 2026 ఏప్రిల్ లో సినిమాని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు ఈ చిత్రం జానర్ కారణంగా భారీగా విజువల్ ఎఫెక్ట్స్ అవసరమని కూడా మేకర్స్ చెబుతున్నారు. హారర్ కామెడీ జానర్‌లో కొత్త సినిమాటిక్ అనుభూతిని సృష్టించడానికి ప్రియదర్శన్ తనవంతు ప్రయత్నిస్తున్నారు. ఏక్తా కపూర్, అక్షయ్ కుమార్ , ప్రియదర్శన్ భూత్ బంగ్లాను ఒక విభిన్నమైన హార్రర్ కామెడీ ఫ్రాంఛైజీగా మార్చే ప్రణాళికలపై సీరియస్ గా చర్చిస్తున్నారని కూడా పింక్ విల్లా తన కథనంలో పేర్కొంది.భూత్ బంగ్లా ఫ్రాంచైజీని మునుముందు అక్షయ్ కుమార్‌తో మాత్రమే ముందుకు తీసుకెళతారని తెలుస్తోంది.




# సూపర్ స్టైలిష్‌గా సోహైల్‌ఖాన్

### ఎన్‌కెఆర్ 21లో పాత్ర ఏంటోమరీ..?

బింబిసార తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్21. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ఇప్పటికే 21 అనౌన్స్ మెంట్ పోస్టర్ లాంచ్ చేశారని తెలిసిందే. ఇందులో పిడికిలి బిగించి ఉన్న కల్యాణ్ రామ్ చేతిపై రక్తపు మరకలు చూడొచ్చు. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సోహైల్‌ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా మేకర్స్ సోహైల్‌ఖాన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంతో సోహైల్ ఖాన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తుండగా.. ఇంతకీ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీలో సయీ మంజ్రేకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో అశోక్ వర్ధన్ ముప్ప, సునిల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో వస్తోన్న రెండో సినిమా ఇది. ఈ చిత్రంలో క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం మేకర్స్ ఏకంగా రూ.8 కోట్లు ఖర్చు పెట్టారని ఇన్‌సైడ్ టాక్. బ్రహ్మ కడలి టీం వేసిన సెట్ డిజైన్‌లో ఫైట్ మాస్టర్ రామకృష్ణ నేతృత్వంలో కల్యాణ్ రామ్‌తోపాటు సుమారు 1000 మంది ఆర్టిస్టులపై వచ్చే ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగనుందట.